మమకారం

[కథానిక]

●

శ్రీ గోపీచంద్

జోగయ్యమామ కర్రపోటు వేసుకుంటూ వచ్చి కాలవకట్టమీద వున్న నేరేడు చెట్టునీడను నుంచున్నాడు. సూర్యుని కిరణాలకు చెయ్యి అడ్డంపెట్టుకుని తన పొలాన్ని ఒక్కసారి చూచుకున్నాడు. తన చేల గట్లమీద వున్న తుమ్మచెట్లన్నీ అతనికి గుర్తే. అవికూడా తనతో పుట్టి, తనతోపాటు పెరుగుతూ వస్తున్నయి. అందులో, తన హయాంలో, అవసరంగా నాగలిదుంపలకు కావలసివచ్చి రెండు తుమ్మచెట్లనుమాత్రం నరికించాడు. అవి వుండే స్థలం యిప్పటికీ అతనికి బోసిగా కనిపిస్తూనేవుంటుంది. ఆ స్థలాన్ని చూచినప్పుడల్లా చేతికింద కొచ్చిన యిద్దరు కొడుకులు తన్ను విడిచివెళ్లినట్లు బాధపడుతూ వుంటాడు.

జోగయ్యమామ నిట్టూర్పువిడుస్తూ తలకు చుట్టుకున్న గుడ్డ పరచి, నేరేడు చెట్టుకింద కూర్చున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు. పెద్దఅతను నర్సయ్య. పొలం పని చూచుకుంటున్నాడు. రెండో అతను దొరయ్య. బట్టలదుకాణం పెట్టి, సొంతంగా నాలుగురాళ్లు సంపాదిస్తున్నాడు. ఆఖరి కొడుకు వెంకటసుబ్బయ్య. ఇంగ్లీషుచదువు చదువుతున్నాడు. వీళ్లుకాక అతని కిద్దరు కూతుళ్లు. అతని పిల్లలందరికీ అతనంటే యిష్టమే. అతనికీ వాళ్లంటే ప్రేమే. కాని అవసరమైతే వాళ్లను చూడకుండా వుండగలడు గాని, తన పొలాన్ని మాత్రం చూచుకోకుండా ఒక్క పూటకూడా వుండలేడు. తన పిల్లలందరూ పొలంమీద పాటుపడాలని వుంటుం దతనికి. పొలాన్ని వృద్ధి చెయ్యటానికే వాళ్లు పుట్టింది అనిపిస్తుంది. అందుకనే బట్టలదుకాణం పెట్టిన కొడుకుమీద మనసులో కొంచెం కోపం. 'వాడూ మంచి వాడే. పెళ్లాంమాట విని చెడిపోయాడు' అని చెపుతాడు.

జోగయ్యమామ కిపుడు వందెకరాలు వుంది. ఆస్తిలో ఎక్కువభాగం తాను రెక్కలమీద సంపాయించినదే. అందుకని మిగిలిన బాంధవ్యాలన్నీ ఆస్తిముందు స్వల్పంగా కన్పిస్తయి అతనికి.

పొలాన్ని ప్రాణప్రదంగా కాపాడతాడు. పొలం బాగా పండటానికి ఏపనైనా చేస్తే అనేకసార్లు తన ప్రాణాలను లెక్క చెయ్యకుండా అవతలవాళ్లు వేయించిన అడ్డకట్టును తీయించి, తన చేనుకి నీళ్లు పెట్టుకున్నాడు జోగయ్య. ఎవ్వళ్లొస్తారో

రండి అని దుడ్డుకర్ర బట్టుకొని చేనుగట్టు మీద నుంచుంటే వూరు వూరంతా హడలెత్తిపోయేది. బాగా నెర్రెగొట్టిన తన చేను ఆ నీటిని గుటగుటా తాగుతుంటే పసివానికి స్తన్యాన్నిస్తూ పరవశత్వంతో కూర్చునే తల్లిలా నుంచునేవాడు. కొడుకులు పెరిగొచ్చింతర్వాత "మేం వుండగా నీకెందుకీ తాపత్రయం, కృష్ణా రామా అనుకుంటూ కాలం గడుపుకోక" అంటున్నారు. వాళ్లకేం తెలుసు పసిగాయలు! యీ తాపత్రియంవల్ల తనెంత సుఖపడుతున్నదీ వాళ్లకు అందే అనుభవం కాదు.

నెల రోజుల క్రితం జోగయ్యమామ భార్యకు జబ్బుచేసి ప్రాణంమీదకు వచ్చింది. అప్పటికి పది రోజులనుంచీ ఆమె ముక్కుతూ మూలుగుతూ వుండే గాని, జోగయ్యమామ అట్టే పట్టించుకోలేదు. ఆ విషయం యింట్లోవాళ్లు ఎవళ్లు కదిలించినా, "రోగాలు మనుష్యులకు రాక మానులకు వస్తయ్యా?" అంటూ వెళ్లేవాడు. దమ్ముచేసే రోజులవి. అతనికి తీరేది కాదు. ఏదైనా జబ్బు అంతతొందరగా మూసుకొస్తుందనుకోలేదు అతను. "నువ్వింట్లో వుండు, అమ్మని కనిపెట్టుకొని; నేను చేను తడిపించి వస్తాను" అని పెద్దకొడుకన్నాడేగాని జోగయ్యమామ యింటిదగ్గర వుండలేకపోయ్యాడు. అనలే నీటికి ఎద్దడిగా వుంది. ఎవరు అడ్డం వేస్తారో. తన పెద్దకొడుకు బుద్ధిమంతుడే కాని పుట్టి అర్భకుడు. అవతలవాళ్లు నోరుచేసుకుంటే వెనక్కు తగ్గుతాడు. తీరా, పొలం తడవకపోతే, తరువాత ఏమనుకునేం లాభం? అందుకని వూళ్లో వైద్యుడిచేత భార్యకు నాలుగు మాత్రిలు యిప్పించి, కాసిని నీళ్లు తాగించి "కళ్లు మూసుకు పడుకో; కునుకు పడుతుంది" అని చెప్పి, తను పొలం బయలుదేరాడు. వూరిచివర చింతచెట్టుదగ్గరికి వచ్చేసరికి కొడుకు పంపిన మనిషి ఎదురుగుండా వచ్చాడు. "అవతలవాళ్లు కర్రలూ బల్లాలూ పుచ్చుకుని సిద్ధంగా వున్నారు. నర్సయ్యకి కాలూ చెయ్యా ఆట్టంలేదు" అని చెప్పాడు.

జోగయ్యమామ గబగబా పొలానికేసి నడిచాడు. కాలవకు వేసిన అడ్డు తెంచి నీళ్లని తన చేలోకి మలిపాడు. అవతలి వాళ్లు కర్రలూ, బల్లాలూ పట్టుకొని చూస్తూ నుంచున్నారేగాని ఏమీ అనలేకపోయారు. తన చేలోకి నడుస్తున్న నీటి గలగల వింటూ సర్వం మరచి నుంచున్నాడు చేనుగట్టుమీద జోగయ్యమామ.

"అమ్మ కెట్లా వుంది?"— అడిగాడు నర్సయ్య.

"ఉంది" అన్నాడు జోగయ్యమామ.

"తగ్గిందా?" అడిగాడు నర్సయ్య.

"తగ్గ కేం జేస్తుంది?" అన్నాడు జోగయ్యమామ.

"ఇంక మనం వెళ్దాం" అన్నాడు నర్సయ్య. యీ మాటకు జోగయ్యమామ వులిక్కిపడ్డాడు. "చేనంతా తడవక ముందే విడిచి వెళ్లడమే?" అన్నాడు జోగయ్యమామ.

"ఇంట్లో ఎవరూ లేరు, మంచికైనా చెడుకైనా" అన్నాడు నర్సయ్య, ఆదుర్దాగా. "నువ్వు వెళ్లు. నే నిక్కడ వుంటా" అన్నాడు జోగయ్య. నర్సయ్యకు తెలుసు—

తన తండ్రి పనిమధ్యలో విడిచిపెట్టి రాడని. ఇష్టంలేకపోయినా, ఏమీ అనలేక తన తండ్రిని చేనుగట్టుమీద విడిచిపెట్టి, యింటికి వెళ్లాడు నరసయ్య.

కాకులు కూస్తుంటే కబురు వచ్చింది-- జోగయ్య మామను తక్షణం రమ్మని. అతనికి తెలుసు తనకూ, తన భార్యకూ ఋణానుబంధం తీరిపోతూ వుందని. కాని చేను యింకా పొకకాస తడవాల్సివుంది. చూస్తూచూస్తూ పని మధ్యన వెళ్లలేక పోయాడు.

నీళ్లు నెమ్మదిగా పారుతూ నెర్రెల్నీ, బొరియల్నీ నింపుతూ ఆ కొసని తడిపింది. అప్పుడు జోగయ్యమామ గబగబా యింటికి బయలుదేరాడు భార్యని చూద్దామని.

అతను వెళ్లేటప్పటికి ఆమె అవసాన దశలో వుంది. ఆ అవస్థలో వుండికూడా ఇంటి సంగతులే మాట్లాడుతూ వుంది. "మూడోవాడికి ముసివెయ్యమంటే నా మాట విన్నారుకాదు" అని భర్తని నిష్ఠూరా లాడింది. రెండోకోడలు తన మాట వింటం లేదని అక్కసు వెళ్లబోసుకుంది. "ఎలుకలు పుకుల్ని కొట్టిపోస్తున్నయ్. కాస్త మట్టి రాయించమంటే రాయించలేకపోతిరి" అన్నది. "బట్టలకి బాగాగంజి పెట్టడంలే"దని చాకలిదానిమీద కేకలువేసింది. తనే మజ్జిగ చెయ్యాలని కవ్వంకోసం లేవబోయింది. "పెద్దకోడలికి వెన్న తియ్యటమే చేతగాదు. సగానికి సగం మజ్జిగలోనే విడిచిపెడుతుంది" అని చెప్పింది. తాను గుటుక్కుమన్న తర్వాత యీకాపరం ఏమవుతుందో అని వేదనపడ్డది.

"ఆమాటలన్నీ ఇప్పు డెందుకు? ఒక్క క్షణం నిశ్చలంగా వుండు" అన్నాడు జోగయ్యమామ.

కాని ఆమెనోటికి మూత పడలేదు. ఆఖరినిమిషంవరకూ మాట్లాడుతూనే వుంది. అందరికీ ఏదో వకటి చెపుతూనే వుంది. పనులు పురమాయిస్తూనేవుంది. చివరికి 'అబ్బో అబ్బో' అంటూ బాధ పడుతూ జోగయ్యమామచెయ్యి గట్టిగా పట్టుకుంది. అతని చెయ్యి పట్టుకునే యీ లోకాన్ని విడిచింది.

* * *

సరిగా యిప్పటికి నెల, ఆమె యీ లోకాన్ని విడిచి. భార్యజబ్బు లెక్కచెయ్య కుండా, ప్రాణాలను లెక్కచెయ్యకుండా అంత కష్టపడి నీరుపెట్టిన చేను మూస తిరిగింది. కూలివాళ్లు కలుపు తీస్తున్నారు. హుషారుగా పాడుతున్నారు, ఆడవాళ్లూ మొగవాళ్లూ కలిసి.

జోగయ్యమామ అట్లాగే నేరేడు చెట్టు నానుకుని కూర్చున్నాడు. అతని మనస్సు ఇదివరకంత స్థిరంగా వుండటం లేదు. తన భార్య చనిపోయేటప్పుడు పడిన తాపత్రయం అతను మరిచిపోలేక పోతున్నాడు. ఆమెకు తెలుసు తను పోతున్నానని. కాని ఒక్కనిద్రపోయి లేచే దానికి మల్లే మాట్లాడింది. పోయేదానికి తన కెందు కివన్నీ? ఒకళ్లకు మాత్రం ఎందుకు? అంతా పోయేవాళ్లే. అయితే యిక కావలసిం దెవరికి? పొలంలోనుంచి పాట వినిపించింది.

ఒక్కసారి కన్ను తెరచి తన పొలం అంతా పారజూశాడు జోగయ్యమామ.

ఆ మధ్య తన మనమడు తనతో పొలం వచ్చాడు. "తాతయ్యా, మన పొలం ఏదీ?" అని అడిగాడు. "నీకు కనబడుతున్నదంతా మందేరా" అన్నాడు. వందయెకరాల ఏకకండ్రిక. తన మనమడికి అవతలిగట్టు కనపడకుండా సముద్రంలా వున్న పొలం చూపిస్తూ "ఇదంతా మందేరా" అన్నప్పుడు అతని మనస్సు ఆనందంతో నిండింది. మొట్టమొదట తా నీవూరు ఎడ్లబేరానికి వచ్చాడు. తా నెవరికయితే ఎడ్లని అమ్మాడో, ఆ ఆసామీకే ఇల్లరికపుటల్లుడయాడు. తన నడవడిక చూచి, తన వ్యవహారికజ్ఞానంచూచి ఆ ఆసామీ మోజుపడి కూతుర్ని తన కిచ్చి చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఆనాటినుంచీ వళ్లు దాచుకోకుండా తాను పనిచేశాడు. తను అడుగు పెట్టినపుడు తన మామకి అయి దెకరాలు వుండేది. తన చెమటతో తడిపి, పండించి పది సంవత్సరాలు తిరిగొచ్చేటప్పటికి ఆ అయిదెకరాలకీ మరొక అయి దెకరాలు జతజేశాడు. తన మామకి తనమీద గురి ఏర్పడ్డది. ఆయన పోతూపోతూ "నిన్ను దగ్గరికి తీసినందుకు నాపరువు నిల్పావు" అన్నాడు. తను పడిన కష్టమంతా ఆ ఒక్క మాటతోనే తీరిపోయింది. తన మామ చనిపోయినప్పటికి వందెకరాలు చేశాడు. కాని వృద్ధిచేస్తున్నపుడు తనకు కలిగిన ఆనందం యిప్పుడు కల్గటంలేదు. రోజూ పొలం రావడం, పొలాన్నంతా ఒక్కసారి చూచుకోవడం, పాలేళ్లను గదమాయించడం— ఇంతవరకే మిగిలింది. అంటే ఆ ఆనందం పోయి అలవాటే మిగిలింది.

జోగయ్యమామ నేరేడుచెట్టు కానుకుని అట్లాగే కూర్చున్నాడు. పొద్దు నెత్తిమీదికొచ్చింది. నేరేడుచెట్టు ఆకుల్లోంచి ఎండ జోగయ్యమామముఖంమీద పడ్డది. ఆ వేడికి ఆయన నెమ్మదిగా కన్ను తెరచి చూశాడు. పొలంలో కూలీలు లేరు. సర్దుకుని గబుక్కున లేవబోయాడు. కదిలాడు. ఎదురుగా చెట్లకు కట్టిన మూటలు విప్పుకుని కూలీలు బువ్వ తినటం చూశాడు. కొంతమంది అన్నంముద్దలు మింగుతున్నారు. కొందరు బట్టలకి చేతులు తుడుచుకొంటున్నారు. కొందరు తలగుడ్డలు విప్పుకొని గట్టుమీద పరుచుకొని పడుకున్నారు.

'లేవండరా' అని కేకలేశాడు జోగయ్యమామ. "ఇంత వయస్సులో దొరకెంత యావ" అని నవ్వుకున్నారు అంతా. "ఇప్పుడేగా దొరా, కూటికొచ్చింది" అన్నాడొకడు కేరింతలు కొడుతూ. ఒక్కొక్కళ్లూ మళ్లీ చేలోకి దిగారు.

జోగయ్యమామ ఒక్కసారి పూరివైపు చూశాడు. మధ్యాహ్నంపూట ఆ నేరేడుచెట్టుకింద అన్నం తింటం జోగయ్యమామకి అలవాటు. యిప్పటికీ ఆయన మనుమరాలు రోజూ అన్నం తెచ్చిపెడుతుంది. దూరంగా అన్నంగిన్నె నెత్తిమీద పెట్టుకొని మనమరాలు రావటం చూశాడు. మబ్బు బాగా వేసింది. వర్షం వస్తుందేమో. తాను తడిస్తే ఫరవాలేదు కాని, తన మనమరాలు తడుస్తుందేమో! వర్షం ఎక్కువైతే పనసచెట్టుకింది గుడిశలోకి వెళ్లాలి. ఎప్పటి గుడిశ. మొట్టమొదట

తాను చేసుకొన్నప్పుడు వేసిన గుడిశ. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అట్లాగే నిలబడివుంది.

"తాతా, అన్నం తెచ్చా" అని మనమరాలు గిన్నె కిందబెట్టి గిన్నెకు కట్టిన గుడ్డ విప్పింది. ఒకపక్క గోంగూర పచ్చడి, నల్లగా నిగనిగలాడుతూ వుంది. ఒక పక్క ఆవకాయపచ్చడి, ఎర్రగా నెత్తురుముద్దలా వుంది. ఆ రెంటిమధ్యా తెల్లటి అన్నం.

"నువ్వు తింటూవుండు తాతయ్యా, నేను చేలోకి వెళ్లివస్తా" అంటూ రివ్వున పరిగెత్తింది మనమరాలు. జోగయ్య మామ నెమ్మదిగా లేచాడు. బట్టలు దులుపుకుని తలకు చుట్టుకొని కర్రపోటు వేసుకుంటూ గట్టు దిగాడు. కాలవలో నీళ్లు దోసెడు తీసికొని నోట్లో పోసుకొని పుక్కిలించి వూశాడు. నెమ్మదిగా మళ్లీ నేరేడుచెట్టుదగ్గర కొచ్చి కూర్చున్నాడు. కర్ర పక్కన పెట్టుకొని అన్నంగిన్నె ముందుకు లాక్కున్నాడు. ఆవకాయ పచ్చడి వేలితో తీసుకొని నాలిక్కి రాసుకున్నాడు. ఒక్క లొట్ట వేశాడు. ధ్వని కలగలేదు. అలవాటుప్రకారం ఆవకాయ పచ్చడి నాలిక్కి రాసుకొని, అలవాటు ప్రకారం లొట్ట వేశా ననుకున్నాడు బాగుం దనుకొని.

*   *   *   *

చేలో కూలీవాళ్లు కలుపు తీస్తున్నారు. జోగయ్యమామ మనమరాలు కాసేపు గట్టుమీద నుంచుని చూసింది. కూలివాళ్లు 'చిన్న దొరసాని వచ్చిం'దని పరియాసకాలాడారు. పరికిణీ కాళ్లకు తగలకుండా చేత్తో పట్టుకొని చేనుగట్టుమీదుగా తాతదగ్గరకు పరిగెత్తడం మొదలుపెట్టింది. దారిలో తండ్రి కనిపించాడు.

"జెరీపరికిణీ వేసుకొచ్చావే అమ్మా' చేలోకి ? బురద కాదూ ?" అని అడిగాడు.

"తాత వేసుకురమ్మన్నాడు నాన్నా. యీపరికిణీ కట్టుకొస్తే చూడా లన్నాడు" అన్నది.

"చూశాడా?"

"మరిచిపోయాడు"

"తాత అన్నం తిన్నాడా అమ్మా?"

"పెట్టొచ్చాను."

"ఎక్కడున్నాడు ?"

"అదేం, ఆ నేరేడుచెట్టుకిందే."

ఇద్దరూ నేరేడుచెట్టుదగ్గరకు బయలుదేరారు. ఆకాశం మబ్బేసింది. వర్షమొస్తుందేమో అనుకున్నాడు నర్సయ్య. అరవయి ఏళ్లు నిండినా తండ్రి పొలం రావటం నర్సయ్యకి యిష్టంలేదు. పొలానికి అన్నం తెప్పించుకోవటం అసలు ఇష్టంలేదు. అతను వూళ్లో పంచాయితీబోర్డుప్రెసిడెంటు. కొంచెం పరువుగా బ్రతకా లంటాడు. కాని ఏం లాభం? తండ్రి తనమాట వినడు చేనుగట్టుమీద అన్నం తింటే పరువు పోతుందా అంటాడు.

ఎక్కడో ఉరిమింది. మెరుపు కూడాను. చిటపట చినుకులు పడుతున్నాయి. కూతురు తన చిట్టినాలుక చాచి చినుకులు రుచిచూస్తోంది. నడుస్తూ

గబగబా నర్సయ్య నేరేడుచెట్టుదగ్గరకు నడిచాడు. చెట్టు నానుకుని కూర్చుని వున్నాడు తండ్రి.

చేతికర్రా, తలపాగా ఒకపక్కన పడి వున్నాయి. కళ్లు మూసుకుని ఏమిటి ఆలోచిస్తున్నాడు? అవసరం వున్నా లేక పోయినా ఆలోచించడం తప్పదు. గుప్పిడి ముక్కుకి ఆనించుకుని ఏదో వాసన చూస్తున్నాడు. గుప్పెట్లో ఏముంది? పువ్వా? కాదు. పొగాకా? కాదు. మన్ను...... పట్టి మన్ను!—నేరేడుచెట్టుకింది రేగడి మన్ను.

'అయ్యా, అయ్యా' అని పిలిచాడు కొడుకు.—మళ్లా పిలిచాడు.

'అబ్బాయ్'—నీరసంగా తండ్రిమాట. గుప్పిడి సడలి చెయ్యి కిందికి వాలి పోయింది. మన్ను ధారగా పడింది. మట్టి మట్టిలో కలిసింది.

'అయ్యా, అయ్యా!'

అయ్య మరి పలకలేదు.